www.prajasakti.com

ప్రజాశక్తి

గురువారం 18 డిసెంబర్ 2025

5

తూర్పుగోదావరి





అమరావతిలో జరిగిన కలెక్టర్ల సమావేశంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి

ఇష్టానుసారంగా కేబుల్ లైన్లు


విద్యుత్ స్తంభాలకు కడుతున్న వైర్లు

రోడ్డుకు అడ్డంగా ఉన్నా పట్టని అధికారులు

ప్రజల ప్రాణాలతో చెలగాటం

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం సిటీ

రాజమహేంద్రవరం నగరంలో ఎక్కడ చూసినా కేబుల్ వైర్లు అస్తవ్యస్తంగా పడి ఉన్నాయి. చెట్లు, కరెంటు స్తంభాలు, అపార్ట్‌మెంట్లకు వేలాడుతున్నాయి. ఏది కేబుల్ వైరో ఏది విద్యుత్ వైరో తెలియని పరిస్థితి నెలకొంది. కొన్ని రోడ్ల రోడ్లపైన వేలాడుతూ ప్రమాదకరంగా మారుతున్నాయి. బాటసారులు, ద్విచక్ర వాహనదారులు వీటిని ప్రమాదాలకు గురవుతున్నారు. వాహనాలపై వెళ్లే వారికి మెడకు తగులుకుని ప్రమాదాలకు గురైన ఘటనలు కోకొల్లలు. దీనిపై నగర పాలక సంస్థగాని, మరి ఏ ఇతర అధికారులు గాని పట్టించుకున్న దాఖలాలు లేవు. తమ వ్యాపారాల నిమిత్తం ఆయా సంస్థల యజమానులు ఇష్టానుసారంగా నిబంధనలకు విరుద్ధంగా కేబుల్ లైన్లు వేస్తున్నారు. విద్యుత్ స్తంభాలనే ఆసరాగా చేసుకుని వీరు కేబుల్ లైన్లు వేస్తున్నారు. కొన్ని చోట్ల విద్యుత్ లైన్లపై సైతం ఈ వైర్లు పడటంతో ప్రమాదకరంగా మారుతున్నాయి. విద్యుత్ శాఖ సిబ్బంది ట్రీకటింగ్ పనులు చేపట్టిన సమయంలో ఈ కేబుల్ వైర్లు తెగి రోడ్లకు అడ్డంగా పడుతున్నాయి. వీటిని తొలగించిన దాఖలాలు కూడా ఆయా సంస్థలు చేయట్లేదు. తెగిపడిన వైర్ల స్థానంలో కొత్త కేబుల్ వైర్లను మాత్రం వేసి వారిపనులకు ఆటంకం లేకుండా చూసుకుంటున్నారు. నగరంలో ఏ వీధిలో చూసినా విద్యుత్ స్తంభాలకు ఈ కేబుల్ వైర్ల దర్శనమిస్తున్నాయి. గడిచిన వారం రోజుల్లో రాజమహేంద్రవరంలో ఈ వైర్లు వలన వివిధ ప్రాంతాల్లో ఏడుగురు వరకూ ప్రమాదాలకు గురయ్యారు.



మెయిన్ బజారులో ఓ షాపు వద్ద విద్యుత్ స్తంభానికి కట్టిన వైర్లు



బైకుపై తెగిపడిన కేబుల్ వైరు

ప్రభుత్వాదాయానికి గండి

కేబుల్ వైర్లను వేసుకోవాలంటే సంబంధిత నెట్‌వర్క్ సంస్థలు కార్పొరేషన్ అనుమతి తప్పని సరి. కాని నగరంలో ఇవేమీ అమలు కావట్లేదు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ట్యాక్స్‌లు కట్టిన దాఖలాలు కూడా లేవు. ఫలితంగా గత పది హేనేళ్లుగా చూసుకుంటే ప్రభుత్వ ఆదాయానికి రూ.10 కోట్ల నుంచి రూ.50 కోట్లకు పైగానే గండి పడినట్లు అంచనా. మరీ ముఖ్యంగా విద్యుత్ స్తంభాలకు ఎటువంటి కేబుల్ వైర్లు, తీగలు కట్టరాదు. కాని ఈ నిబంధన ఎక్కడా అమలు కావట్లేదు. దీనిపై సంబంధిత సంస్థలపై చర్యలు తీసుకున్న దాఖలాలు కూడా లేవు. టెలికాం, విద్యుత్, ఇరిగేషన్, మున్సిపాలిటీల నుంచి పర్మిషన్ కూడా తీసుకోకుండానే ఆయా సంస్థలు తమ కేబుళ్లను ఇష్టాను సారంగా వేసేస్తున్నాయి.



నిరసన తెలుపుతున్న పెన్షనర్లు

కనీస పింఛను రూ.9వేలు ఇవ్వాలి

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం సిటీ

కనీస పింఛను రూ.9వేలు ఇవ్వాలని, ఎపిఆర్‌పిఎ జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. డిమాండ్ల సాధన కోసం, సమస్యల పరిష్కారం కోసం శ్యామల సెంటర్ వద్ద పెన్షనర్లు నిరసన బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి సిహెచ్ మోహన్‌రావు, సిఐటియు జిల్లా కార్యదర్శి బి.పవన్ మాట్లాడారు. డిసెంబర్ 17న పెన్షనర్ల దినోత్సవాన్ని జరుపుకుంటున్నామన్నారు. పెన్షన్ భిక్ష కాదని ఉద్యోగి హక్కు అన్నారు. కనీస పింఛను రూ.9వేలు, డిఎతో కలిపి చెల్లించాలన్నారు. సీనియర్ సిటిజన్ల అదనపు పెన్షన్‌ను అమలు చేయాలన్నారు. రైల్వే బోగీలు పెంచి సీనియర్ సిటిజన్లకు రైల్వే రాయితీలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పెన్షనర్ల సమస్యలను పరిష్కరించాలన్నారు. లేకుంటే భవిష్యత్తులో ఉద్యమానికి దిగుతామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్.సోమేశ్వరరావు, బిఎస్.ప్రభాకరరావు, కెఎస్.రామచంద్రరావు, సిహెచ్.ప్రసాద్, కె.లాజర్, ఎస్‌కె.రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ధవళేశ్వరం పిహెచ్‌సిలో నూతన బ్లాక్ ప్రారంభం

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం రూరల్

ధవళేశ్వరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నూతనంగా నిర్మించిన బ్లాక్ పబ్లిక్ హెల్త్ యూనిట్ భవనాన్ని రాజమహేంద్రవరం రూరల్ ఎంఎల్‌ఎ గోరంట్ల బుచ్చయ్య చౌదరి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొత్తగా ఏర్పడిన తూర్పుగోదావరి జిల్లాలో ప్రథమంగా ఈ పబ్లిక్ హెల్త్ యూనిట్ భవనాన్ని ప్రారంభించామన్నారు. ఈ నూతన భవనంలో ప్రజలకు మరింత మెరుగైన వైద్య సేవలు అందించేలా ఇంటిగ్రేటెడ్ ల్యాబ్ పరీక్షలు, స్టోర్ రూమ్, హెచ్‌ఎంఐఎస్ రిపోర్టింగ్ రూమ్ వంటి సౌకర్యాలను ఏర్పాటు చేశారని తెలిపారు. ఈ భవనం నిర్మాణానికి ప్రభుత్వం సమకూర్చిన రూ.50 లక్షలు, పేపర్‌మిల్లు సిఎస్‌ఆర్ నిధులు రూ.11 లక్షలను కేటాయించామన్నారు. ప్రభుత్వ ప్రాథమిక వైద్యశాలల్లో ప్రజలకు నాణ్యమైన, అందుబాటులో ఉన్న వైద్య సేవలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. పిహెచ్‌సిల్లో వైద్య సేవలతో పాటు మందులు, రక్త పరీక్షలు కూడా ఉచితంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ విషయాలు తెలియక చాలా మంది ప్రయివేటు ఆసుపత్రులకు వెళ్లి అధిక ఖర్చులు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో సాధారణ ప్రసవాలు ప్రధానంగా నిర్వహించడంతో పాటు, అవసరమైన సందర్భాల్లో సీజేరియన్ ఆపరేషన్లు కూడా చేస్తున్నారని చెప్పారు. ఈ ఆసుపత్రికి మినరల్ వాటర్ ప్లాంట్‌ను త్వరలో ఏర్పాటు చేస్తామన్నారు. వైద్య ఖర్చుల వల్ల ఇబ్బందులు పడుతున్న పేద ప్రజలను గుర్తించి సిఎం సహాయ నిధి ద్వారా ఆర్థిక సాయం అందిస్తున్నామని తెలిపారు. రాజమహేంద్రవరం రూరల్ నియోజకవర్గంలో గత 17 నెలల్లో రూ.3కోట్లకు పైగా ఆర్థిక సాయం అందించామన్నారు. ఎన్‌టిఆర్ వైద్య సేవ కింద చికిత్సకు సంబంధించిన బిల్లులను ఎప్పటికప్పుడు చెల్లిస్తున్నామన్నారు. గత ప్రభుత్వం హయాంలో పెండింగ్‌లో ఉన్న రూ.2,600 కోట్లను విడతల వారీగా చెల్లింపులు చేస్తున్నట్లు వివరించారు. వైద్య అధికారులు మాట్లాడుతూ, ఈ నూతన భవనం ప్రారంభంతో ధవళేశ్వరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో మరింత ఎక్కువ మంది ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుబాటులోకి వస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ ఆర్‌విఎ.సత్యనారాయణ, డాక్టర్ రోహిత, తహశీల్దార్ శ్రీనివాస్, ఎంపిడిఒ ఆర్మ్ స్ట్రాంగ్, ధవళేశ్వరం సిఐ టి.గణేష్, స్థానిక నాయకులు మత్స్యేటి ప్రసాద్, మజ్జి పద్మావతి, కుమ్మరి శాలివాహన కార్పొరేషన్ డైరెక్టర్ పండూరి అప్పారావు, తలారి మూర్తి, నిమ్మలపూడి రామకృష్ణ, భీమరశెట్టి రమేష్, సిబ్బంది పాల్గొన్నారు.



పిహెచ్‌సిలో నూతన బ్లాక్‌ను ప్రారంభిస్తున్న ఎంఎల్‌ఎ గోరంట్ల



నూతన కార్యవర్గాలు

ట్రస్ట్ బోర్డు చైర్మన్ల ప్రమాణ స్వీకారం

ప్రజాశక్తి-పెరవలి

మండలంలోని తీపర్రులో ఉన్న దేవస్థానాల ట్రస్ట్ బోర్డ్ నూతన చైర్మన్లు, సభ్యులు బుధవారం ప్రమాణ స్వీకారం చేశారు. శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి దేవస్థానం చైర్మన్‌గా యన్నమని ఉదయభాస్కరరావు, శ్రీరాజరాజ నరేంద్రస్వామి దేవస్థానం చైర్మన్‌గా బలుసు వెంకట్రావు, ఈడ్పుగంటి రత్తమ్మ ధర్మ సత్రం చైర్మన్‌గా ఎంజెకె.హరినాథ్‌బాబు, కార్యవర్గ సభ్యులు దేవస్థానం కార్య నిర్వాహక అధికారి ఎంవి.రామయ్య ఆధ్వర్యంలో ప్రమాణ స్వీకారం చేశారు ఈ కార్యక్రమంలో జనసేన, టిడిపి మండలం అధ్యక్షులు పిప్పర రవికుమార్, అతికాల శ్రీను, సొసైటీ అధ్యక్షులు కంటిపూడి సూర్యనారాయణ, పత్తిపాటి ప్రసాద్, సింహాద్రి సత్యనారాయణ, మొగలపు సీతారాం నాయకులు పాల్గొన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మూర్తి తదితరులు

20 నుంచి డోర్ డెలివరీ ప్రచార మాసోత్సవాలు

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం సిటీ

ఈ నెల 20 నుంచి జనవరి 19 వరకూ ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో ఆర్‌టిసి డోర్ డెలివరీ ప్రచార మహోత్సవాలు నిర్వహించనున్నట్లు తూర్పుగోదావరి జిల్లా ప్రజారవాణాధికారి వైఎస్ఎన్.మూర్తి తెలిపారు. దీనికి సంబంధించిన గోడ పత్రికను ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ మాసోత్సవాలను రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్నామన్నారు. రాష్ట్రంలో 84 ప్రధాన నగరాలు, పట్టణాల్లో పది కిలో మీటర్ల దూరంలో యాభై కేజీల వరకు డోర్ డెలివరీ చేస్తామన్నారు. అతివేగంగా, తక్కువ ధరతో, సురక్షితంగా వినియోగదారుల ఇంటి వద్దకే సరుకులను చేర్చుతామనానరు. పార్సిల్ ట్రాకింగ్ కూడా ఏర్పాటు చేశామన్నారు. ఈ అవకాశాన్ని ప్రతీ ఒక్కరూ వినియోగించుకోవాలని పిలుపు నిచ్చారు. ఈ సదుపాయం రాజమహేంద్రవరం, కాకినాడ, తుని, రాజోలు, అమలాపురం, అన్నవరం, కొవ్వూరు, నిడదవోలు, రావులపాలెం, రామచంద్రపురం డిపోలో కల్పించామన్నారు. ఈ కార్యక్రమంలో రాజమహేంద్రవరం డిపో మేనేజర్ కె.మాధవ్, ఎఐ ఎస్.నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పెన్షనర్స్ డే

జిల్లాలో పెన్షనర్స్ డేను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సీనియర్ పెన్షనర్లను సత్కరించారు. సభలు, సమావేశాలను నిర్వహించారు.

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం రూరల్

ధవళేశ్వరంలోని స్థానిక ఉడతా వారి వీధిలో ఉన్న పెన్షనర్స్ అసోసియేషన్ కార్యాలయం వద్ద పెన్షనర్ల దినోత్సవాన్ని బుధవారం నిర్వహించారు. నకారా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అసోసియేషన్ అధ్యక్షులు యర్రమోతు ధర్మరాజు మాట్లాడుతూ నకారా చూపిన మార్గం వల్లే నేడు పెన్షనర్లు జీవిస్తున్నారన్నారు. ప్రధాన కార్యదర్శి దువ్వూరి కామేశ్వరశర్మ, కోశాధికారి ఉర్రింకల సత్యనారాయణ, ప్రొఫెసర్ ఐవి.సుబ్బారావు, కాట్రగడ్డ వెంకటేశ్వర్లు, వి.సాంబశివరావు, డిఎజెబి ప్రసాద రావు మాట్లాడారు. అనంతరం డాక్టర్ విన్నకోట పవన్ కుమార్ ఆయుర్వేద వైద్యశిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తోరం కేశవరావు, కొండా సూర్యనారాయణ, సమర్తకుర్తి సుబ్బారావు, అంజూరి సూర్యారావు, కొంజెర్ల వెంకటరత్నం, శ్రీరాములు, కె.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు, మహ్మద్ అబ్దుల్లా అల్పాహారం, తేనేటి విందు ఇచ్చారు. డాక్టర్ పవన్ కుమార్‌ను ఈ సందర్భంగా సత్కరించారు.

దేవరపల్లి : ఆంధ్రప్రదేశ్ స్టేట్ గవర్నమెంట్ రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ దేవరపల్లి మండల శాఖ ఆధ్వర్యంలో జాతీయ పెన్షనర్స్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నకారా, వైవి.చంద్రచూడ్‌లకు నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో కేశిరాజు సీతారామయ్య, పప్పు వెంకట రామారావు, ఎలమటి సత్యనారాయణ, ఈడుపుగంటి నాగేశ్వరరావు, బేబీ సరోజినీ, సయ్యద్ ఆలీ సాహెబ్, పూర్ణచంద్ర, కళావతి, వెలిచెర్ల సూర్యనారాయణమూర్తి, సుగుణలత, విజయలక్ష్మి, పద్మజ పాల్గొన్నారు.

చాగల్లు : విశ్రాంత ఉద్యోగులు మార్గదర్శకులు అని ఎస్ఐ కె.నాగేంద్ర అన్నారు. బుధవారం స్థానిక అంబేద్కర్ రీడింగ్ భవనంలో పెన్షనర్ల సంఘం అధ్యక్షులు కోడి నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగిన పెన్షనర్ల దినోత్సవంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కుమారి సిహెచ్.పూర్ణిక సాంస్కృతిక ప్రదర్శన ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో కె.సత్యవతి, బివి.సూర్యనారాయణ, ఎస్.వెంకటరత్నం, ఆర్.ఎస్తేరమ్మ, ఎస్.పుణ్యవతి, డి.నాగేశ్వరరావు, టి.మేరీజిరం జీవిలను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో దాసరి నాగేశ్వరరావు, వి.గంగాధరం, కెఎస్ఎన్.మూర్తి, జి.డానియేల్, సుశీల,సత్యవాణి తదితరులు పాల్గొన్నారు.

తాళ్లపూడి : అన్ని సంక్షేమ పథకాలను సకాలంలో అదించాలని విశ్రాంత ఉద్యోగులు ప్రభుత్వాన్ని కోరారు. పెన్షనర్స్ డే సందర్భంగా సమావేశాన్ని నిర్వహించారు. ముగ్గురు విశ్రాంత ఉద్యోగులను మండల మానవతా శాఖ సత్కరించింది. మానవతా అధ్యక్షుడు వై.శ్రీనివాస్, సభ్యులు, విశ్రాంత ఉద్యోగులు పాల్గొన్నారు.



ధవళేశ్వరంలో నకారాకు నివాళులర్పిస్తున్న పెన్షనర్లు

రూ.450 కోట్ల పనులకు ప్రతిపాదనలు

ఎంఎల్‌ఎ ముప్పిడి వెంకటేశ్వరరావు

ప్రజాశక్తి - కొవ్వూరు

రానున్న గోదావరి పుష్కరాలకు కొవ్వూరు పట్టణాభివృద్ధి కోసం రూ.450.70 కోట్ల ప్రతిపాదనలను ప్రభుత్వానికి పంపామని ఎంఎల్‌ఎ ముప్పిడి వెంకటేశ్వరరావు ప్రకటించారు. చైర్పర్సన్ భావన రత్నకుమారి అధ్యక్షతన మున్సిపల్ కౌన్సిల్ సమావేశం బుధవారం నిర్వహించారు. ఎక్స్ ఆఫిసియల్ సభ్యునిగా ఆయన హాజరై మాట్లాడారు. పురపాలక సంఘం ఏర్పడి 60 ఏళ్ల పూర్తయిన సందర్భంగా డైమండ్ జూబ్లీ ఉత్సవాలు నిర్వహిస్తే బాగుంటుందని సూచించారు. గ్రేడ్ 3లో ఉన్న పురపాలక సంఘాన్ని గ్రేడ్-1 మున్సిపాలిటీగా మార్చాలని మంత్రి నారాయణ కు ప్రతిపాదనలు పంపినట్లు ఆయన తెలిపారు. రూ.6 కోట్ల ఆదాయం పైబడితే పురపాలక సంఘాన్ని గ్రేడ్ వన్ పరిధిలో చేర్చాల్సి ఉంటుందన్నారు. 2027 జూన్ 26 నుంచి జూలై 7 వరకు గోదావరి పుష్కరాల నిర్వహణకు తేదీలను ప్రభుత్వం ఖరారు చేసినట్లు ఆయన ప్రకటించారు. ఇటీవలే మున్సిపాలిటీలో వివిధ పనుల నిమిత్తం రూ.4 కోట్లతో మున్సిపల్ శాఖ మంత్రి నారాయణకు ప్రతిపాదనలు అందించామన్నారు. దీనిలో రూ.2 కోట్లు ఇచ్చేందుకు మంత్రి అంగీకరించారన్నారు. పట్టణంలో డ్రెయినేజీ వ్యవస్థను మరింత మెరుగుపరచాల్సిన అవసరం ఉందన్నారు. గోదావరి నీటిని శుద్ధి చేసి తాగునీరుగా సరఫరా చేసేందుకు అవసరమైన ప్రాజెక్టు నిర్మాణ పనులకు టెండర్ల ప్రక్రియ పూర్తయ్యిందన్నారు. ఈ ప్రాజెక్టు పూర్తయితే కొవ్వూరు పట్నంతో పాటు మండలంలో తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం ఏర్పడుతుందన్నారు. పెరవలిలో రూ.1400 కోట్లతో గోదావరి నీటిని శుద్ధి చేసి తాగునీరుగా సరఫరా చేసే ప్రాజెక్టుకు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఈనెల 20న శంకుస్థాపన చేయనున్నట్లు ఆయన తెలిపారు. పదవ తరగతి విద్యార్థుల్లో ఉత్తీర్ణతా శాతం పెంచేందుకు వందరోజుల ప్రణాళికను ప్రభుత్వం అమలు చేస్తుందన్నారు. పురపాలక సంఘం తరఫున టెన్త్ విద్యార్థులకు అవసరమైన అల్పాహారాన్ని సమకూర్చాలని ఆయన కోరారు. కొవ్వూరును ప్రథమ శ్రేణి మున్సిపాలిటీగా మార్చేందుకు ప్రతిపాదించిన అంశాన్ని కౌన్సిల్ ఆమోదం తెలిపింది. అనంతరం పురపాలక సంఘం 2025 26 బడ్జెట్ ను సమావేశంలో ప్రవేశపెట్టారు. నూతన బడ్జెట్ కు కౌన్సిల్ ఆమోదం తెలిపింది. మండల సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

ఘనంగా షర్మిలరెడ్డి పుట్టినరోజు

ప్రజాశక్తి - నిడదవోలు

పట్టణంలో కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నియోజకవర్గం కో-ఆర్డినేటర్ మేడవరపు భద్రం దొర ఆధ్వర్యంలో ఎపి పిసిసి అధ్యక్షురాలు వైఎస్.షర్మిలరెడ్డి పుట్టినరోజును భుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక నాయకులు, కార్యకర్తలు కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా భద్రందొర మాట్లాడుతూ ఉపాధి చట్టానికి గాంధీ పేరును తొలగించి అవమానపరిచారన్నారు. నాడు గాడ్సే మహాత్మా గాంధీని భౌతికంగా హత్య చేస్తే, ఈనాడు బిజెపి ప్రభుత్వం గాంధీ ఆశయాలను, ఆలోచనలను నైతికంగా హత్య చేస్తున్నారన్నారు. ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేసేందుకు బిజెపి ప్రభుత్వం కుట్రలు పన్నుతుందనానరు. ఇటువంటి కుటిల ప్రయత్నాలను ఎదుర్కొనడానికి కాంగ్రెస్ పార్టీ సిద్ధంగా ఉందన్నారు. అవసరమైతే మహా ఉద్యమం చేయడానికి అయినా వెనకాడబోమని హెచ్చరించారు. షర్మిలరెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ త్వరలోనే పూర్వ వైభవాన్ని సంతరించుకుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో చిన్నం మురళీకష్ణ, బండి అభిషత్తుడు, కాకి కిషోర్, భాస్కర్, కళ్లెం ఆనందరావు పాల్గొన్నారు.

పుష్కరాల నాటికి రోడ్ల అభివృద్ధి

ప్రజాశక్తి - చాగల్లు

పుష్కరాల నాటికి మండలంలో రోడ్లు అన్నీ అభివృద్ధి చేయాలని ఎంఎల్‌ఎ ముప్పిడి వెంకటేశ్వరరావు అధికారులకు సూచించారు. చాగల్లు మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశంలో బుధవారం ఎంపిపి మట్ట వీరస్వామి అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో ఎంఎల్‌ఎ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. మండల అభివృద్ధికి అధికారులు, ప్రజాప్రతినిధులు కలిసి పనిచేయాలన్నారు. పుష్కరాల ప్రత్యేక నిధులు వస్తున్నట్లు తెలిపారు గ్రామాల్లో అన్ని లింకు రోడ్లు అభివృద్ధి చేయాలని సూచించారు. రాజకీయాలకతీతంగా అందరూ గ్రామాభివృద్ధికి కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి మట్టా వీరాస్వామి, మండల స్పెషల్ ఆఫీసర్ చింతల శ్రీనివాస్ ఎంపిడిఒ ఆర్.శ్రీదేవి, ఎంపిటిసి సభ్యులు కో-ఆప్షన్ సభ్యులు ఎస్‌కె.పాషా సర్పంచులు, సొసైటీ అధ్యక్షులు బొల్లిన శివనాగేంద్ర, యంత్రప్రగడ అబ్బులు తదితరులు పాల్గొన్నారు.

సర్వేకు ప్రజలు సహకరించాలి

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

మండలంలోని యునిఫైడ్ ఫ్యామిలీ సర్వే కోసం ఇంటింటా పర్యటించే సచివాలయ సిబ్బందికి సహకరించి వివరాలు అందించాలని ఎంపిడిఒ ఎం.శ్రీనివాసరావు మండల ప్రజలకు విజ్ఞప్తి చేశారు. కుటుంబం అందుకుంటున్న సంక్షేమ పథకాలు గురించి అడుగుతారని, వారికి వివరాలు అందించాలన్నారు. భవిష్యత్తులో ఆయా కుటుంబాలకు ప్రభుత్వం నుంచి ఐడి జారీ చేస్తారన్నారు. తద్వారా లబ్ధిదారులకు సంక్షేమ పథకాలు నేరుగా ప్రభుత్వమే అందించేలా ఏర్పాట్లు చేస్తుందన్నారు. అన్ని వివరాలు ఒకే చోట నిక్షిప్తమై ఉండటంతో ప్రభుత్వం అందించబోయే అన్ని సేవలు ఒకే గొడుగు కిందకి వచ్చినట్లవుతాయని వెల్ఫేర్ అసిస్టెంట్ ఆకుల శ్రీనివాస్ తెలిపారు.


సైన్స్ ఫెయిర్‌లో బ్రాహ్మణగూడెం విద్యార్థుల ప్రతిభ

చాగల్లు : మండలంలోని చాగల్లు జడ్‌పి ఉన్నత పాఠశాలలో బుధవారం నిర్వహించిన మండల స్థాయి సైన్స్ ఫెయిర్‌లో బ్రాహ్మణగూడెం విద్యార్థులు ప్రతిభ కనబర్చి మొదటి స్థానంలో నిలిచారని హెచ్‌ఎం వాసవి తెలిపారు ఈ కార్యక్రమాన్ని పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎస్.వాసవి ప్రారంభించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల లెక్చరర్లు న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారు. కెవిఎస్.రామాంజనేయులు డివైఇఒ అధ్యక్షతన విజేతలను ప్రకటించారు మొదటి బహుమతి బ్రాహ్మణగూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు, రెండో బహుమతి కలవలపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు చేజిక్కించుకున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఇన్‌ఛార్జి రాళ్లపల్లి వరప్రసాదరావు, సిఆర్‌ఎంటి, జె.రాజేష్ కుమార్ ఇతర పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆర్ట్స్ కళాశాలలో గెస్ట్ లెక్చర్

రాజమహేంద్రవరం సిటీ : నగరంలోని ఆర్ట్స్ కళాశాలలో ఆంగ్ల లెక్చరర్ డాక్టర్ స్వర్ణశ్రీ యాదాడ 'సాహిత్యం మరియు జీవితం : మెరుగైన మానవులుగా మార్చడంలో సాహిత్యం పాత్ర' అనే అంశంపై గెస్ట్ లెక్చర్ ఇచ్చారు. ఆంగ్ల విభాగం ఇన్‌ఛార్జ్ శ్రీలక్ష్మి అధ్యక్షత వహించారు. బిఎ స్పెషల్ ఇంగ్లీష్ విద్యార్థులు, ఆంగ్ల విభాగం అధ్యాపకులు పాల్గొన్నారు. మానవ జీవితాన్ని మెరుగుర్చడంలో సాహిత్యం ప్రాముఖ్యతను స్వర్ణశ్రీ వివరించారు. పుస్తకాలు చదవడాన్ని ప్రతి ఒక్కరూ అలవర్చుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇంగ్లీష్ లెక్చరర్ డాక్టర్ నాగభూషణం, విద్యార్థులు పాల్గొన్నారు.

కార్టూ'నిజం'



ఆటల పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి - నిడదవోలు రూరల్

నిడదవోలు ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో బుధవారం మండల స్థాయి ఆటల పోటీలను ప్రారంభించారు. ఈ ఆటల పోటీలను నిడదవోలు మండల పరిషత్ అధ్యక్షులు తిరుమళ్ల భాగ్యలక్ష్మి, జడ్‌పిటిసి సభ్యులు కొయ్యే సూర్యారావు ప్రారంభించారు. వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, యోగా, షటిల్, బ్యాడ్మింటన్, రన్నింగ్, షాట్ పుట్, లాంగ్ జంప్‌లో పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ, ఎంఇఒ, పీడీలు, కూటమి నాయకులు, ఎంఇఒలు కెఎన్‌వి.గణేష్, పి.గురునాథమూర్తి పీడీలు పాల్గొన్నారు.

ఉండ్రాజవరం : క్రీడాకారులు రాణించాలని ఉండ్రాజవరం మాజీ సర్పంచ్, టిడిపి నాయకులు గన్నమని వెంకటసుబ్రహ్మణ్యం విద్యార్థులకు సూచించారు. బుధవారం, ఉండ్రాజవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వికసిత్ భారత్ సన్సద్ ఖేల్ మహోత్సవంలో ఆయన పాల్గొన్నారు. తాడిపర్రు సర్పంచ్ కరుటూరి నరేంద్రబాబుతో కలిసి ప్రారంభించారు. విద్యార్థులకు కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహిస్తారని ఎంపిడిఒ ఎం.శ్రీనివాసరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో క్రీడాకారులు, ఎంఇఒలు సక్సేనా రాజు, శారదా జోత్స్న, హెచ్‌ఎం పి.రామకృష్ణ, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కొవ్వూరు : యువతను క్రీడల్లో ప్రోత్సహించాలనే ఉద్దేశంతోనే ప్రభుత్వం సన్ సదన్ ఖేల్ మహోత్సవం నిర్వహిస్తుందని ఎంఎల్‌ఎ ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. కొవ్వూరు బాలికల జడ్‌పి ఉన్నత పాఠశాలలో బుధవారం ఆయన ఆటల పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడల పట్ల విద్యార్థులకు మరింత ఆసక్తి పెంచేలా కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కొవ్వూరు ఎంపిడిఒ టి.రమణ, టూమెన్ కమిటీ సభ్యులు జొన్నలగడ్డ సుబ్బరాయ చౌదరి, కంఠమణి రామకృష్ణ, ఎంపిపి కాకర్ల నారాయుడు, మాజీ మున్సిపల్ చైర్మన్ సూరపని చిన్ని, సూర్యదేవర రంజిత్, పెనుమాక జయరాజు, జొన్న బాలకష్ణ, సిరిబొమ్మల నరేష్ తదితరులు పాల్గొన్నారు.

గోపాలపురం : విద్యతో పాటూ క్రీడల్లోనూ సత్తా చాటాలని ఎంపిపి ఉండవల్లి సత్యనారాయణ అన్నారు. మండల స్థాయి సైన్స్ ఫెయిర్, క్రీడా పోటీలను ఆయన ప్రారంభించారు. ఎంపిడిఒ జి.రాజమనోహర్, హెచ్‌ఎం పి.వెంకటకనకపద్మ, ఈలి శరత్‌బాబు తదితరులు పాల్గొన్నారు.



బాలకృష్ణను సత్కరిస్తున్న జనసేన నాయకుడు యడ్ల మహేష్

పవర్ లిఫ్టింగ్ క్రీడాకారుడు బాలకృష్ణకు సన్మానం

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం రూరల్

అంతర్జాతీయ పవర్‌లిఫ్టింగ్ పోటీల్లో ప్రతిభ కనబర్చిన ధవళేశ్వరం గ్రామ గ్రీన్ అంబాసిడర్, ఆర్‌జి.బాలకృష్ణను జనసేన నాయకులు యడ్ల మహేష్ సత్కరించారు. తన పుట్టిన రోజును పురస్కరించుకుని బాలకృష్ణకు రూ.10వేల నగదు బహుమతి అందించారు. ఈ సందర్భంగా మహేష్ మాట్లాడుతూ భవిష్యత్తులో మరిన్ని పతకాలు సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, జనసైనికులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

ఐదుగురికి రూ.50 వేల జరిమానా

ప్రజాశక్తి - తాళ్లరేవు

మండలంలోని కోరంగి పోలీస్‌స్టేషన్ పరిధిలో మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న 11 మందిపై పోలీసులు కేసులు నమోదు చేశారు. వారిని కాకినాడ ఫస్ట్ క్లాస్ సివిల్ జడ్జి ఎదుట పోలీసులు హాజరుపర్చారు. వారిలో ఐదుగురికి రూ.10 వేలు చొప్పున రూ.50 వేలు జరిమానా విధించగా, మరో ఆరుగురికి రెండు రోజుల చొప్పున జైలు శిక్షను విధించారని ఎస్ఐ పి.సత్యనారాయణ తెలిపారు. రోడ్డు ప్రమాదాల నివారణలో భాగంగా ముందస్తుగా వాహనాలను తనిఖీలు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

కాంగ్రెస్ నేతలపై కేసుల నమోదు

ప్రజాశక్తి - దేవరపల్లి

దేవరపల్లి బస్టాండ్ సమీపంలో బుధవారం నిరసన తెలిపిన కాంగ్రెస్ నాయకులపై పోలీసులు కేసు నమోదు చేశారు. రోడ్డుకు అడ్డంగా నిలబడి ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించారని, గడ్డి బొమ్మను తగుల బెట్టి ఇబ్బందులు సృష్టించడంతో కేసులు నమోదు చేసినట్టు పోలీసులు తెలిపారు. కాకర్ల హరిబాబు, వెలగా రామకృష్ణ, మట్టపర్తి రామ్మోహన్, గన్నిన రామా నాయుడు, సుంకర సత్యనారాయణ, జ్యేష్ఠ సతీష్, మార్టిల్ లూథర్ తదితరులుపై కేసు నమోదు చేశామని తెలిపారు.

ఉపాధి పనులు చేపట్టేందుకు చర్యలు

ప్రజాశక్తి - గొల్లప్రోలు, పిఠాపురం

గొల్లప్రోలు మండలంలో ఉపాధి హామీ పనులు చేపట్టేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నట్లు చీఫ్ క్వాలిటీ కంట్రోల్ ఆఫీసర్ బి.గోపిచంద్ అన్నారు. బుధవారం మండలంలోని చేబ్రోలు, దుర్గాడ, వన్నెపూడి గ్రామాల్లో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా చెరువు అభివృద్ధి పనులు, చెరువు గట్లు పటిష్టత, వాకింగ్ ట్రాక్‌లు, పార్కులో మొక్కల పెంపకం వంటి అభివృద్ధి పనులు చేపట్టేందుకు అవకాశం ఉన్న ప్రదేశాలను ఆయన పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఉపాధి హామీ పీడీ వసంతమాధవి, ఎంపిడిఒ సెలెట్‌రాజు, ఎపిఒ గంగాభవాని, నీటి సంఘం అధ్యక్షులు, తదితరులు పాల్గొన్నారు. అలాగే పిఠాపురం మండలం బి.ప్రత్తిపాడు, ఎఫ్‌కె.పాలెం, రాపర్తి గ్రామాల్లోనూ ఆయన పర్యటించారు. ఆయా గ్రామాల్లో సుమారు రూ.60 లక్షలతో వివిధ అభివృద్ధి పనులను చేపట్టనున్నట్లు గోపిచంద్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ కె.స్వప్న, ఎపిఒ నాయుడు, తదితరులు పాల్గొన్నారు.



గొల్లప్రోలు మండలంలో పర్యటిస్తున్న ఉపాధి హామీ అధికారులు

ఫజులుల్లా ఖాన్-షేక్ మదీనా పుస్తకావిష్కరణ

ప్రజాశక్తి - పెద్దాపురం

మన్యం విప్లవవీరుడు అల్లూరి సీతారామరాజుకు స్వాతంత్ర్య పోరాటంలో అండగా నిలిచిన ఫజులుల్లా ఖాన్-షేక్ మదీనాలపై సయ్యద్ నజీర్ అహ్మద్ రచించిన పుస్తకాన్ని బుధవారం ఆవిష్కరించారు. స్థానిక యాసలపు సూర్యారావు భవనంలో సాహితీ స్రవంతి జిల్లా అధ్యక్షులు డాక్టర్ జోషుల కృష్ణబాబు అధ్యక్షతన పుస్తకావిష్కరణ సభ జరిగింది. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ అల్లూరి సీతారామరాజుకు తుపాకీ పేల్చడంలో శిక్షణ ఇచ్చిన షేక్ మదీనా పెద్దాపురం వాసి కావడం గర్వకారణమన్నారు. అనేక పోరాటాల చరిత్రలో పెద్దాపురం అంతర్భాగంగా ఉందన్నారు. ఈ సభలో పెద్దాపురం చరిత్ర పరిశోధకుడు వంగలపూడి శివకృష్ణ, ముక్తార్ ఆలీ, చల్లా విశ్వనాథం, బుద్దా శ్రీనివాస్, పెద్దిరెడ్డి నరేష్, లక్ష్మణ్ దివాకర్, కొత్త శివ, తదితరులు పాల్గొన్నారు.



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న కవులు, రచయితలు

ఉపాధి చట్టం పేరు మార్పుపై 22న నిరసన

ప్రజాశక్తి - కాకినాడ రూరల్

మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం పేరు మార్పుపై ఎపి వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం జరిగింది. బుధవారం రూరల్ మండలం తిమ్మాపురం, నేమం, పండూరు గ్రామాల్లో ఉపాధి చట్టం పేరు మార్పుపై వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వరయంలో ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర ఉపాధ్యాక్షులు తాటిపాక మధు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన కొత్త బిల్లు చట్టమైతే ఉపాధి హామీ చట్టం తల లేని మొండెంగా మారుతుందని అన్నారు. ఉపాధి హామీ చట్టంలోని 'హామీ' అనే పదాన్ని తొలగించడం ద్వారా ఈ చట్టం నిర్వీర్యం అవుతుందన్నారు. పనిదినాలు 125 రోజులకు పెంచుతున్నట్లు చెప్పి, 60 రోజులు పని నిషేధం విధించారని విమర్శించారు. ఈ బిల్లుకు వ్యతిరేకంగా ఈ నెల 22న కలెక్టరేట్ వద్ద జరుగుతున్న నిరసన కార్యక్రమంలో ఉపాధి హామీ కార్మికులు, వ్యవసాయ కూలీలు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రజాసంఘాల నాయకులు తోకల ప్రసాద్, నక్క శ్రీనువాస్‌రావు, అప్పలరాజు, పప్పు ఆదినారాయణ, సరస్వతి, మోహన్, వీరబాబు, చిట్టిమ్మ పాల్గొన్నారు.



ఉపాధి కార్మికులతో మాట్లాడుతున్న తాటిపాక మధు

ఘనంగా క్రిస్మస్ వేడుకలు

ప్రజాశక్తి - పెద్దాపురం, తాళ్లరేవు

పెద్దాపురం మండలం తిరుపతి గ్రామంలో క్రిస్టియన్ గాస్పల్ మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో క్రీస్తు శాంతి ప్రార్థనా మందిరంలో క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. శామ్యూల్ సుదీప్ అధ్యక్షతన జరిగిన ఈ వేడుకలో పాలచర్ల గాడ్స్ గ్రేస్ గాస్పల్ మినిస్ట్రీస్ అధినేత గ్రేస్ విక్టర్ మాట్లాడారు. సిజిఎం గౌరవాధ్యక్షులు నంగిన సత్యానందం, శాంత కుమారి దంపతులు క్రిస్మస్ కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో వంకా జాన్, కాసా అభిషేక్, జయకుమార్, ఎలిసా, శాంతకుమారి, ప్రేమలత, విశాల, సుజాత, రూత్ ప్రశాంతి, తదితరులు పాల్గొన్నారు. అలాగే తాళ్లరేవులో యానం, తాళ్లరేవు పాస్టర్స్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో ఫ్యామిలీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఫెలోషిప్ అధ్యక్షులు, జడ్‌పిటిసి సభ్యులు దొమ్మేటి సామ్యూల్ సాగర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రత్తిపాడు పోప్ ఫౌండేషన్ డైరెక్టర్ బిషప్ మాసా ఇమ్మానుయేల్ క్రిస్మస్ సందేశాన్ని ఇచ్చారు. అనంతరం సామ్యూల్‌సాగర్‌ను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో బిషప్ దొమ్మేటి వసంతరావు, బిషప్ జోసెఫ్ బెన్నీ, శీరం ఐజాక్, జాషువా గిరి, మాసా జాన్, స్టీవెన్ బాబు, సాల్మన్ రాజు పాల్గొన్నారు.



తాళ్లరేవులో జడ్‌పిటిసి సాగర్‌ను సత్కరిస్తున్న పాస్టర్లు

గడ్డివామి దగ్ధం

ప్రజాశక్తి - సీతానగరం

పురుషోత్తపట్నం గ్రామానికి చెందిన యనమదల యేసు అనే రైతుకు చెందిన గడ్డివామి దగ్ధమైంది. బాధితుడు యేసు పశువులను మేపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఏడాది పొడవునా పశువుల మేత కోసం ఎంతో శ్రమించి సిద్ధం చేసుకున్న గడ్డి కట్టలు కాలిపోవడంతో సుమారు రూ.40 వేల నష్టం వాటిల్లిందని వాపోయాడు. దీనిపై సీతానగరం పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. అధికారులు స్పందించి తమను ఆదుకోవాలని బాధితుడు వేడుకుంటున్నాడు.

శానిటేషన్‌ను మెరుగుపర్చాలి

ప్రజాశక్తి - కడియం

పంచాయతీ పరిధిలో శానిటేషన్ మెరుగుకు చర్యలు తీసుకోవాలని స్పెషల్ ఆఫీసర్, ఆర్ఎంసి కమిషనర్ రాహుల్ మీనా సిబ్బందిని ఆదేశించారు. బుధవారం ఆయన వేమగిరి పంచాయతీ పర్యటించారు. తొలుత పంచాయతీ కార్యాలయాన్ని సందర్శించి రికార్డులను తనిఖీ చేశారు. అనంతరం గ్రామంలోని పారిశుధ్య పనులను పరిశీలించారు. వీధుల్లో చెత్త పేరుకుపోకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. డ్రెయినేజీల్లో మురుగు పారేలా ఎప్పటికప్పుడు సిల్ట్ తొలగించాలని సిబ్బందిని ఆదేశించారు. దోమల నివారణకు ఫాగింగ్ చేయాలన్నారు. ఈ సందర్భంగా స్థానిక పరిస్థితులు, మౌలిక సదుపాయాల కల్పనపై ప్రజలతో చర్చించారు. ప్రజల విజ్ఞప్తి మేరకు గ్రామంలో నూతన రహదారి, డ్రెయిన్ నిర్మాణానికి వెంటనే ప్రతిపాదనలు పంపాలని అధికారులను ఆదేశించారు. ఆయన వెంట పంచాయతీ అధికారులు, ఇతర సిబ్బంది ఉన్నారు.

నూనె గింజ పంటలపై అవగాహన

ప్రజాశక్తి - గొల్లప్రోలు

మండలంలోని దుర్గాడ గ్రామంలో నూనె గింజల పంటపై బుధవారం రైతులకు అవగాహన కల్పించారు. ఆచార్య ఎన్‌జి రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం, పెద్దాపురం ఏరువాక కేంద్రం, వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పిఠాపురం వ్యవసాయ శాఖ ఎడి పి.స్వాతి మాట్లాడుతూ రైతులు నూనె గింజల పంటపై అవగాహన పెంచుకోవాలన్నారు. ఈ పంటలు వేసుకునేందుకు రైతులు ముందుకు రావాలన్నారు. నువ్వు పంటలో చీడపీడల నివారణ వ్యాధులపై పెద్దాపురం ఏరువాక సమన్వయకర్త డాక్టర్ ఎ.సీతారామశర్మ అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ శాఖ అధికారి కెవివి.సత్యనారాయణ, గ్రామ ఉప సర్పంచ్ పి.సూర్యచంద్రరావు, ఆర్ఎస్‌కె సిబ్బంది పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న వ్యవసాయ శాఖ ఎడి స్వాతి



పిహెచ్‌డిని అందుకుంటున్న వెంకటేశ్వరరావు

పిహెచ్‌డి అందుకున్న వెంకటేశ్వరరావు

ప్రజాశక్తి - కాకినాడ

స్థానిక పిఆర్ ప్రభుత్వ కళాశాల అధ్యాపకులు తాతపూడి వెంకటేశ్వరరావు నన్నయ యూనివర్శిటీ నుంచి పిహెచ్‌డిని అందుకున్నారు. యూనివర్శిటీ విసి ఆచార్య ప్రసన్నశ్రీ చేతుల మీదుగా ఈ అవార్డును ఆయన అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిఆర్ కళాశాల నుంచి మొట్టమొదటి పిహెచ్‌డిని అందుకోవడం సంతోషంగా ఉందన్నారు. పిఒఎం జూప్లాంక్టాన్ అనే అంశంపై పరిశోదన చేసినట్లు ఆయన తెలిపారు. జువాలజీ విభాగ అధ్యాపకులు డాక్టర్ ఎన్.శ్రీనివాస్ మార్గదర్శకత్వంలో పిహెచ్‌డిని పూర్తి చేసినట్లు వెల్లడించారు. రిజిస్ట్రార్ ఆచార్య కెవి.స్వామి, ప్రిన్సిపల్ డాక్టర్ పి.విజయనిర్మల, డాక్టర్ ఎన్.శ్రీనివాస్, తదితరులు వెంకటేశ్వరరావును అభినందించారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న ఎంఎల్ఎ చినరాజప్ప

ఆకట్టుకున్న సైన్స్ ఫెయిర్ ప్రదర్శనలు

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో బుధవారం నిర్వహించిన మండల స్థాయి సైన్స్ ఫెయిర్‌లో విద్యార్థులు ప్రదర్శించిన పలు ప్రాజెక్టులు ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ఎంఎల్ఎ నిమ్మకాయల చినరాజప్ప, డివైఇఒ ఈరంకి ప్రభాకర శర్మ, మున్సిపల్ మాజీ ఛైర్మన్ రాజా సూరిబాబురాజు ఈ ప్రదర్శలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ చినరాజప్ప మాట్లాడుతూ ఇటువంటి ప్రదర్శనలు విద్యార్థుల్లో దాగివున్న సృజనాత్మకత వెలుగులోకి వస్తాయన్నారు. తద్వారా సమాజ అభివృద్ధికి దోహదం అవుతాయన్నారు. ఈ కార్యక్రమంలో సిఐ శంకరం, హెచ్‌ఎంలు రవి, కెనడీ, కూటమి నాయకులు శాస్త్రి, నాగు, సత్తిబాబు, సతీష్, ఆరీఫ్, వీరబాబు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉత్తమ ఫలితాల సాధనకు కృషి

ప్రజాశక్తి - కరప

జిల్లాలో పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించేందుకు కృషి చేస్తున్నట్లు డిఇఒ పి.రమేష్ తెలిపారు. బుధవారం మండలంలోని వేలంగి, నడకుదురు మోడల్ స్కూల్స్‌ను ఆయన సందర్శించారు. పదో తరగతి పరీక్షలకు సిద్ధమౌతున్న విద్యార్థుల స్థితిగతులను ఉపాధ్యాయుల ద్వారా అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదో తరగతికి చెందిన విద్యార్థులకు 100 రోజులపాటు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. తద్వారా నూరు శాతం ఉత్తీర్ణత సాధించేలా కృషి చేస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒ కెబి.కృష్ణవేణి, సిఆర్‌ఎంటిలు పి.సత్యనారాయణ, వై.నాగలక్ష్మికుమారి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న డిఇఒ రమేష్

కమిటీలను ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి - గొల్లప్రోలు

మండలంలో వికలాంగ కమిటీలను ఏర్పాటు చేయాలని యువస్పందన స్వచ్ఛంద వికలాంగ సంఘం నాయకుడు బివివి.సత్యనారాయణ కోరారు. బుధవారం మండలంలోని చేబ్రోలులోని జనసేన పార్టీ కార్యాలయంలో జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాళ్లూరి రామ్‌ను ఆయన కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో గ్రామ, మండల స్థాయి వికలాంగుల కమిటీలను ఏర్పాటు చేయడంతోపాటు, 2016 జిఒను అమలు చేసేందుకు వికలాంగులను భాగస్వాములు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు ఉలవలశెట్టి శ్రీను, తదితరులు పాల్గొన్నారు.



స్టడీ మెటీరియల్‌ను ఆవిష్కరిస్తున్న ఎంఇఒలు

స్టడీ మెటీరియల్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - పెరవలి

మండల వనరుల కేంద్రంలో పదో తరగతి విద్యార్థుల విద్యాభివృద్ధే లక్ష్యంగా యుటిఎఫ్ ఆధ్వర్యంలో రూపొందించిన పదో తరగతి నూతన మోడల్ టెస్ట్ పేపర్స్ బుక్స్‌ను మండల విద్యాశాఖ అధికారులు బిబిఎస్.స్వరూప్, షేక్ సూర్జాన్ బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా విద్యాశాఖ అధికారి స్వరూప్ మాట్లాడుతూ ఇది పదోతరగతి విద్యార్థులకు ఎంతో ఉపయుక్తంగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి వి.వెంకటరమణ, రాష్ట్ర కౌన్సిలర్ పి.వెంకటరాముడు, ప్రధాన కార్యదర్శి తారా కృష్ణ, అధ్యక్షులు పి.నరేంద్రబాబు, అసోసియేట్ అధ్యక్షులు వి.రాధిక కార్యదర్శులు వి.శ్రీనివాస్ రెడ్డి, కోశాధికారి కె.మహేష్, ఇఎస్.చక్రవర్తి జిల్లా కౌన్సిలర్ ఎం.రాజేష్ తదితరులు పాల్గొన్నారు



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎంఎల్ఎ వెంకటేశ్వరరావు

సొసైటీ క్యాలెండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - చాగల్లు

ఊనగట్ల సొసైటీ రూపొందించిన 2026 క్యాలెండర్‌ను ఎంఎల్ఎ ముప్పిడి వెంకటేశ్వరరావు బుధవారం ఆవిష్కరించారు. చాగల్లు మండల ప్రజా పరిషత్ సమావేశంలో పాల్గొన్న అనంతరం ఆయన దీన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి మట్టా వీరాస్వామి, ఊనగట్ల సొసైటీ అధ్యక్షులు బొల్లిన శివనాగేంద్ర, చాగల్లు గ్రామ అధ్యక్షులు దొంగ రామకృష్ణ, వై.అబ్బులు, తాళ్లూరి ప్రసాద్, ఎంపిటిసి, కూటమి నాయకులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాద బాధితులకు పరామర్శ

ప్రజాశక్తి - గోకవరం

మండలంలోని మల్లవరంలో ఇటీవల అగ్ని ప్రమాదంలో గృహాలను కోల్పోయిన ఇమ్మన గంగరాజు, ఎం.పెదకాపు, వై.వీర్రాజు, వై.వెంకటరమణ, కె.నూకరత్నం కుటుంబాలను ఉభయ గోదావరి జిల్లాల విద్యార్థి విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్ తోట శ్రీరాంజీ బుధవారం పరామర్శించారు. ఈ ప్రమాదంలో రూ.10లక్షల వరూ ఆస్తినష్టం జరిగిందని బాధితులు ఆయనకు తెలిపారు. ఒక్కో కుటుంబానికి 25 కేజీల బియ్యం అందించారు. ఈ కార్యక్రమంలో సేనాపతి త్రిమూర్తులు, గోకాడ చిట్టిబాబు, కళ్యాణ్, పల్లెల కొండలు, అల్లం వెంకన్న, రమణ, వైసిపి జగ్గంపేట అధ్యక్షుడు రావుల గణేష్ రాజా, జగ్గంపేట టౌన్ అధ్యక్షుడు కె.ప్రసాద్ పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి-కడియం

మండలంలో పలు అభివృద్ధి పనులకు ఎంఎల్ఎ గోరంట్ల బుచ్చయ్య చౌదరి బుధవారం శంకుస్థాపనలు చేవారు. ఈ సందర్భంగా గోరంట్ల మాట్లాడుతూ కడియం మండలానికి సంబంధించి, పంచాయతీ రహదారుల అభివృద్ధికి రూ.8.50 కోట్లు మంజూరు చేశామన్నారు.కడియం మండల పరిధిలో మొత్తం రూ.10 కోట్ల విలువైన ఆర్ అండ్ బి పనులకు అనుమతి వచ్చిందన్నారు. కడియపు లంకలో పిహెచ్‌సి భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. భవన నిర్మాణానికి అదనంగా మరో రూ.50 లక్షల నిధులు సమకూర్చే దిశగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ సందర్భంగా ఆసుపత్రి స్థల దాత అన్నందేవుల రామసూర్య సీతామహాలక్ష్మి కుటుంబ సభ్యులైన అన్నందేవుల గంగాధరం, పార్వతి, దినేష్ తదితరులను గోరంట్ల అభినందించారు. అనంతరం కడియపుసావరంలో పంచాయితీ నిధులతో నూతనంగా నిర్మించనున్న షాపులకు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమాల్లో ఎంపిపి వెలుగుబంటి ప్రసాద్, సర్పంచ్‌లు మారిశెట్టి పద్మావతి, చెక్కపల్లి మురళి, ఎపిఐఐసి డైరెక్టర్ మార్గాని సత్యనారాయణ, నాయకులు వెలుగుబంటి నాని, గట్టి నరసయ్య, గట్టి సుబ్బారావు, పాఠంశెట్టి రాంజీ, మార్గాని ఏడుకొండలు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలకు 5జి ఫోన్ల అందజేత

ప్రజాశక్తి - చాగల్లు

మండలంలో అంగన్‌వాడీ టీచర్లకు ప్రభుత్వం సమకూర్చిన 5జి మొబైళ్లను ఎంఎల్ఎ ముప్పిడి వెంకటేశ్వరరావు బుధవారం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొవ్వూరు నియోజకవర్గంలో 223 మంది అంగన్‌వాడీ టీచర్లకు, 8 మంది సూపర్‌వైజర్లకు, బిపిసికి మొత్తంగా 232 మొబైల్స్ అందించనున్నామని తెలిపారు. ఈ ఫోన్ల ద్వారా పోషణ ట్రాకర్, బాల సంజీవిని యాప్‌ల ద్వారా గర్భిణులు, బాలింతలు, చిన్నారుల ఆరోగ్యం, పోషణ వివరాలు, సేవల అమలు స్థితిని అంగన్‌వాడీ టీచర్లు నేరుగా నమోదు చేయొచ్చన్నారు. ఈ సమావేశంలో ఎంపిపి మట్టా వీరాస్వామి, సిడిపిఒ కె.నాగలక్ష్మి, ఊనగట్ల సొసైటీ అధ్యక్షుడు బొల్లిన శివనాగేంద్ర, చాగల్లు గ్రామ అధ్యక్షులు దొంగ రామకృష్ణ , యంత్రప్రగడ అబ్బులు, తాళ్లూరి ప్రసాద్, ఎంపిటిసి సభ్యులు, సర్పంచులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

కడియం : అంగన్‌వాడీ సూపర్ వైజర్లు, టీచర్లకు 5జి సెల్ ఫోన్లను ఎంఎల్ఎ గోరంట్ల బుచ్చయ్యచౌదరి బుధవారం అందజేశారు. మండలంలోని కడియపులంక కార్యక్రమం నిమిత్తం విచ్చేసిన గోరంట్ల వీటిని అందించి మాట్లాడారు. అంగన్‌వాడీ కార్యకర్తల పనితీరు, చిన్నారుల స్థితిగతులు ఎప్పటికప్పుడు ఉన్నతాధికారులకు తెలియపర్చేందుకు మొబైల్స్ ఉపయోగ పడతాయని పేర్కొన్నారు. కడియం మండలానికి 82 సెల్ ఫోన్లు మంజూరయ్యాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్ వైజర్లు, టీచర్లు, పలువురు కూటమి నాయకులు పాల్గొన్నారు.

పల్స్‌పోలియోను జయప్రదం చేయాలి

ప్రజాశక్తి - తాళ్లపూడి

ఈనెల 21న నిర్వహించనున్న పల్స్ పోలియోను జయప్రదం చేయాలని డిప్యూటీ ఎంపిడిఒ వీరన్న సూచించారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు ఎంపిడిఒ కార్యాలయంలో బుధవారం పంచాయతీ, సచివాలయ, వైద్య సిబ్బందికి ఒకరోజు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తాళ్లపూడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ మాట్లాడుతూ అప్పుడే పుట్టిన బిడ్డ నుంచి ఐదేళ్ల లోపు పిల్లలకు పోలియో చుక్కలు వేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాల పంచాయతీ, సచివాలయ కార్యదర్శులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

దేవరపల్లి : దేవరపల్లి మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం పల్స్ పోలియోపై మండల స్థాయి సమన్వయ సమావేశం నిర్వహించారు మండల పరిషత్ అధ్యక్షులు కె.వి.కె. దుర్గారావు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. వైద్యులు మాట్లాడుతూ మండల వ్యాప్తంగా ఐదేళ్లలోపు 9,450 మంది పిల్లలను గుర్తించామన్నారు. మొత్తం 67 పోలియో బూత్‌లను ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ నాగార్జునరావు, తహశీల్దార్ ఎం.శ్రీనివాస్, వైద్యాధికారులు బి.మౌనిక, బి.ప్రశాంత్, డి.సంజీవ్, సిబ్బంది, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

కళ్యాణ మండపం కోసం వినతి

ప్రజాశక్తి-కడియం

మండలంలో కాపు కళ్యాణ మండపం నిర్మాణానికి సహకరించాలని పలువురు కాపు నాయకులు ఎంఎల్ఎ గోరంట్ల బుచ్చయ్య చౌదరిని కోరారు. బుధవారం కడియపులంకలో పిహెచ్‌సి శంకుస్థాపనకు వచ్చిన సందర్భంగా వారు ఎంఎల్ఎను కలిశారు. పిహెచ్‌సి నిర్మిస్తున్న స్థలాన్ని దాత కాపు కళ్యాణ మండప నిర్మాణానికి ఇచ్చారని, అయితే గ్రామ పెద్దలు, ప్రజల కోరిక మేరకు ఆ స్థలాన్ని పిహెచ్‌సికి కేటాయించామన్నారు. ఈ నేపథ్యంలో కళ్యాణమండపానికి సహకరించాలని మండల కాపు ఐక్యవేదిక నాయకులు ఆదిమూలం సాయిబాబా ఆధ్వర్యంలో విన్నవించారు. దీనికి ఎంఎల్ఎ సానుకూలంగా స్పందించారు. స్థలాన్ని చూపితే నిధులు మంజూరు చేయిస్తానన్నారు. ఎంపిపి ప్రసాద్ కలగజేసుకుని కడియంలో మండపం నిర్మాణానికి స్థలాన్ని కేటాయిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో గట్టి సుబ్బారావు, గెడ్డం శివ, మల్లు శివ, పుల్లా రామన్న, బొర్సు సుబ్రహ్మణ్యం కాపు ఐక్యవేదిక సభ్యులు పాల్గొన్నారు.

గాంధీ పేరు తొలగింపుపై నిరసన

ప్రజాశక్తి-కొవ్వూరు

మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో గాంధీ పేరు తొలగిస్తూ ఎన్‌డిఎ ప్రభుత్వం కొత్త చట్టం చేయడం దుర్మార్గమని నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ కోఆర్డినేటర్ ఎండి పసివుల్లా బేగ్ అన్నారు. బుధవారం కాపవరంలో గాంధీ విగ్రహం వద్ద కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ఎన్ఆర్ఇజిఎస్ పథకంలో గాంధీ పేరు కొనసాగించాలని నినదించారు. గాంధీజీ విగ్రహానికి పూలమాలు వేసి నివాళుల ర్పించారు. ఎన్‌డిఎ ప్రభుత్వం నిరంకుశత్వ పాలన విడనాడాలన్నారు. జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు ఎమ్‌డి రఫీఉల్లాబేగ్, ఎఐసిసి సభ్యులు అమర్షాహ బేగ్ మహ్మద్, రాజమండ్రి పార్లమెంట్ ఎస్‌సి సెల్ అధ్యక్షులు సాకా పుల్లారావు, చాగల్లు మండల కాంగ్రెస్ అధ్యక్షులు మట్టా సుబ్బారావు, చాగల్లు గ్రామ అధ్యక్షులు మీసాల సత్యనారాయణ,జొన్నకూటి రవికుమార్ పాల్గొన్నారు.

పంట అవశేషాలు తగల బెట్టరాదు

ఉండ్రాజవరం: వరి పంట అవశేషాలు తగలబెట్ట కూడదని మండల రైతులకు వ్యవసాయ అధికారి బి.రాజారావు సూచించారు. బుధవారం మండలంలోని వేలివెన్ను, దమ్మెన్ను గ్రామాల్లో ఆయా గ్రామాల సర్పంచుల అధ్యక్షతన ఏర్పాటుచేసిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో రైతులకు పలు సూచనలు చేశారు. పంట అవశేషాలను తగలబెట్టడం ద్వారా భూమిలోని సూక్ష్మజీవులు నష్టపోవడంతో పాటు భూసారం తగ్గుందన్నారు. వాతావరణ కాలుష్యం ఏర్పడే అవకాశం ఉందన్నారు. దాని బదులు నారుమడి దున్నే సమయంలోనే పొలాన్ని దున్ని ఎకరాకు 100 నుంచి 150 కేజీలు సింగల్ సూపర్ ఫాస్ఫేట్ ఎరువు వేయాలన్నారు. తద్వారా వరి నాట్లు వేసే సమయానికి పూర్తిగా కుళ్ళి, మంచి ఎరువుగా తయారవుతుందన్నారు.